క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ నేడు కలెక్టరేట్ల ఎదుట నిరసన

కాశోజీ సెంటర్: ఇటీవల సుప్రీం కోర్టు అనుకూలంగా ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును నిరసిస్తూ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పిలుపు మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ఎదుట సోమవారం నిరసన నిర్వహించనున్నట్లు మాల మహానాడు జాతీయ కార్యదర్శి బండి అశోక్ తెలిపారు. అనంతరం కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేటి నుంచి సీపీఎం జిల్లా మహాసభలు



కాజీపేట: కాజీపేట పట్టణ శివారులోని పీఎఫ్ కార్యాలయం సమీపంలోని కనకదుర్గ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నుంచి మూడు రోజుల పాటు సీపీఎం జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు మండల కమిటీ బాధ్యుడు ఓరుగంటి సాంబయ్య తెలిపారు. ఈమేరకు కాజీపేట చౌరస్తాలో ఆదివారం ఆయన మాట్లాడుతూ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు, ఆస్పత్రుల్లో పేదలకు ఉచిత వైద్య సేవలు, డబుల్ బెడ్రూం ఇళ్లు వంటి అంశాలపై మహాసభల్లో సమగ్రంగా చర్చించనున్నట్లు వివరించారు. సంటి రవి, ఎండి.అలీ, తొట్టె మల్లేశం పాల్గొన్నారు.

అప్పాజ్యోసుల సత్యనారాయణకు పురస్కారం



హన్మకొండ కల్చరల్: వరంగల్ సహృదయ సాంస్కృతిక సంస్థ, హైదరాబాద్ అనంత లక్ష్మీకాంత శారదాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో రేవూరి లక్ష్మీకాంతరావు శతజయంతిని పురస్కరించుకుని అనంత లక్ష్మీకాంత సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈమేరకు హనుమకొండ వడ్డెపల్లిరోడ్డు పీఆర్‌రెడ్డి భవన్‌లో సహృదయ సంస్థ అధ్యక్షుడు గన్నమరాజు గిరిజామనోహర బాబు అధ్యక్షతన ఆదివారం జరిగిన సభలో న్యూఢిల్లీ ప్రసారభారతి రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రేవూరి అనంత పద్మనాభరావు, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ రిటైర్డ్ ప్రొఫెసర్ డీఎస్ఎన్ మూర్తి ముఖ్యఅతిథులుగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం డాక్టర్ రేవూరి అనంత పద్మనాభరావు పురస్కార పూర్వాపరాలు వివరించి అప్పాజ్యోసుల, విష్ణుభట్ల, కందాళం ఫౌండేషన్ అధ్యక్షుడు అప్పాజ్యోసుల సత్యనారాయణకు అనంత లక్ష్మీకాంత సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి కుందావఝ్ఝల కృష్ణమూర్తి, సాహిత్య కార్యదర్శి మల్యాల మనోహరరావు, సభ్యులు వనం లక్ష్మీకాంతరావు, డాక్టర్ ఎన్వీఎన్ చారి, భాస్కర్‌రావు, జూలూరి నాగరాజు, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ అమలు చేయాలి



హసన్‌పర్తి: నీట్, ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో కేంద్రప్రభుత్వం కల్పించిన 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలుకు చర్యలు తీసుకోవాలని ఓసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పాడి గణపతిరెడ్డి కోరారు. ఈమేరకు సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని హైదరాబాద్‌లో ఆదివారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గణపతిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో మెడికల్ కళాశాలల్లో రిజర్వేషన్లు అమలు చేయడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం హసన్‌పర్తి మండల అధ్యక్షుడు వీసం సురేందర్‌రెడ్డి, మండల కార్యదర్శి రాజిరెడ్డి, సంయుక్త కార్యదర్శి వెల్గెటి రాజిరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర టింబర్ సామిల్ మర్చంట్ జిల్లా అధ్యక్షుడిగా సతీష్



ఖిలా వరంగల్: తెలంగాణ రాష్ట్ర టింబర్ సామిల్ మర్చంట్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా కరీమాబాద్‌కు చెందిన ఊరుగొండ సతీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు సకిలం రమణయ్య, కార్యదర్శి గోపికృష్ణ అధ్యక్షతన వరంగల్ శ్రీనాగేంద్రనగర్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఎనుకున్నారు. కార్యదర్శిగా కనకాచారి, కోశాధికారిగా రాకేష్, ఉపాధ్యక్షుడిగా రవి ఎన్నికయ్యారు.

'ప్రైవేట్ టీచర్లను కించపర్చడం సరికాదు'

విద్యారణ్యపురి: హైదరాబాద్‌లో ఎల్‌బీ స్టేడియంలో ప్రభుత్వ ఉపాధ్యాయులతో నిర్వహించిన సభలో ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను కించపరిచే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారని టీపీటీఏ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు చందర్‌లాల్ నాయక్ చౌహాన్ తెలిపారు. సీఎం అలా మాట్లాడడం సరికాదని ఒక ప్రకటనలో తెలిపారు.

కనుమరుగవుతున్న చిందు యక్షగానం

● జీవనోపాధి కల్పించాలని కళాకారుల వేడుకోలు



ప్రైవేట్ ఉత్సవంలో చిందు కళాకారుల ప్రదర్శన



స్టేజ ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

కాజీపేట: ఉమ్మడి వరంగల్ జిల్లాలో చిందు కళాకారుల బతుకులు చిందరవందరగా తయారయ్యాయి. ఉమ్మడి జిల్లాలో వేల సంఖ్యలో చిందు కళాకారులు తమ కళను నమ్ముకుని జీవనం సాగించేవారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తమ బతుకులు బాగుపడతాయన్న వారి ఆశలు అడియాశలుగానే మిగిలాయి. స్వరాష్ట్రంలోనూ జీవనోపాధి లేక దుర్భర జీవితాలను సాగిస్తున్నారు. చిందు కళకు తెలంగాణలో ప్రత్యేక స్థానం ఉంది. రాష్ట్రంలో జరిగే ముఖ్యమైన పండుగలు దసరా, వినాయక చవితి, ఇతర వేడుకల్లో చిందు కళాకారుల ప్రదర్శనకు గతంలో చాలా ప్రాధాన్యం ఉండేది. తమ ప్రదర్శనను మూడు నుంచి అయిదు రోజుల పాటు గ్రామాల్లో ప్రదర్శించే వారు. ఎల్లమ్మ జీవిత చరిత్ర, దుర్గాదేవి జీవిత చరిత్ర, మార్కండేయ, శశిరేఖ పరిణయం, నల్ల పోచమ్మ జీవిత చరిత్రపై చిందు కళాకారులు ప్రదర్శనలు ఇచ్చేవారు. ఒకప్పుడు చిందు కళాకారుల ప్రదర్శనను వీక్షించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి ఎంతో ఇష్టంతో ప్రజలు తరలి వచ్చేవారు. రాత్రంతా చిందు కళాకారుల ప్రదర్శనలు కొనసాగినప్పటికీ ప్రజలు అలాగే చూస్తుండిపోయేవారు.

చిందు కళాకారుల ప్రదర్శనకు గుర్తింపు

తెలంగాణ రాష్ట్రంలో చిందు కళాకారులకు అనాది కాలం నుంచి ప్రజల్లో ఎనలేని ఆదరణ ఉందని చెప్పొచ్చు. ఎన్నికలు, ఉత్సవాల్లో చిందు కళాకారులే ముందు వరుసలో ఉంటారు. వారి ఆటపాటలకు ఇప్పటికీ మంచి గుర్తింపు ఉందంటే ఆ కళకు ఉన్న గొప్పదనం చెప్పకనే అర్థమవుతుంది. తెలంగాణ ఉద్యమ సమయంలో సైతం చిందు కళాకారుల ప్రదర్శనలు ప్రజల్లో ఉత్తేజాన్ని, చైతన్యాన్ని తీసుకువచ్చాయి. చిందు కళాకారుల ఆటలకు అప్పట్లో మంత్రముగ్ధుడైన కేసీఆర్.. చిందు కళాకారుల బతుకులు మార్చేందుకు భరోసా ఇచ్చారు. అయినా నేటికీ వారి బతుకుల్లో ఎలాంటి పురోగతి లేకుండా పోయింది. కులవృత్తులను ప్రోత్సహిస్తామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం చిందు కళాకారుల జీవితాలను బాగు చేయడంలో విఫలమవుతోందనే చెప్పాలి. ఎంతో ఘన చరిత్ర ఉన్న చిందు కళాకారుల జీవితాలలో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకుంటే చిందు యక్షగాన కళాకారుల కళ కనుమరుగయ్యే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

చిందు కళాకారుల డిమాండ్లు

- చిందు కళాకారులకు దళితబంధు వంటి ప్రత్యేక పథకాన్ని వర్తింపజేయాలి.
- కళాకారులందరికీ పింఛన్ సౌకర్యం కల్పించాలి.
- అర్హులైన వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు, మూడెకరాల భూమి కేటాయించాలి.
- గుర్తింపు కార్డులు ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించాలి.

కళ ఉన్నా ఆదరణ కరువు



చిందు యక్షగాన కళాకారులు ఉమ్మడి వరంగల్ జిల్లాలో అనేక మంది ఉన్నారు. ప్రేక్షకులను మెప్పించే కళ తమలో ఉన్నప్పటికీ ఆదరణ కరువైంది. కళనే నమ్ముకున్న ఎంతోమంది కళాకారులు సరైన కూడు, గూడు లేక ప్రైవేట్ ప్రోగ్రామ్‌ల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం చిందు కళాకారులను ఆదుకోవాలి.

– గడ్డం మూగయ్య, చిందు యక్షగాన కళాకారుడు

కేరళ వరద బాధితులను ఆదుకుందాం



విరాళాలు సేకరిస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: కేరళ వరద బాధితులను ఆదుకుంటామని, అందుకు ప్రజలు తమవంతు సహాయ సహకారాలు అందించాలని సీపీఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాష్మియా పిలుపునిచ్చారు. వయనాడ్ వరద బాధితుల సహాయార్థం సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారి వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల సమీప కాలనీల్లో ఆదివారం విరాళాల సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళలో గతంలో ఎన్నడూలేని విధంగా ప్రకృతి బీభత్సం సృష్టించిందని, దాంతో వందలాది మంది మృతి చెందారని, వేలాది మంది నిరాశ్రయులయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి విపత్కార పరిస్థితుల్లో ప్రతిఒక్కరూ స్పందించి మానవతా దృక్పథంతో ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ విపత్తుగా ప్రకటించి బాధితులను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో దండు లక్ష్మణ్, జాన్‌పాల్, సువర్ణ, సౌందర్య, జన్ను రాజు, కరుణాకర్, రమేష్‌గౌడ్, ఎడ్ల రాజు, కొమురయ్య, హేమలత, మంద శ్రీను, రాజేశ్వరి పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు న్యాయం చేయాలి



సదస్సులో మాట్లాడుతున్న నాగరాజు

వరంగల్ చౌరస్తా: అసంఘటిత రంగంలోని కార్మికులకు న్యాయం చేయాలని టాస్క్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల నాగరాజు డిమాండ్ చేశారు. చౌర్‌బౌళిలోని పద్మశాలి భవన్‌లో రాష్ట్ర విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబాటి నాగయ్య అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్యఅతిథిగా నాగరాజు మాట్లాడారు. అసంఘటిత రంగ కార్మికుల శ్రేయస్సు కోసం సమగ్ర చట్టం తేవాలని కోరారు. కష్ట సమయాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుంచి కార్మికులకు ఎలాంటి సహాయం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు, న్యాయంగా ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీల సాధన కోసం నిర్వహించాల్సిన పోరాటాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. టాస్క్ అధ్యక్షుడు రవి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు కోటి మంది అసంఘటిత రంగ కార్మికులు వివిధ రంగాల్లో పని చేస్తున్నారని తెలిపారు. జాతీయ ఉత్పత్తి జీడీపీలో 67 శాతం ఆదాయం ఆ కార్మికులు శ్రమ ద్వారా ప్రభుత్వానికి వస్తోందని వివరించారు. అలాంటి కార్మికులు తమ శేషజీవితాన్ని దయనీయంగా గడుపుతున్నారని వాపోయారు. ఈ సదస్సులో వీరస్వామి, దాసరి రమేష్, రామ సురేందర్, సందీప్, గజ్జ చందు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి చేస్తా..



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

హసన్‌పర్తి: కాలనీల అభివృద్ధికి కృషి చేస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు తెలిపారు. నగరంలోని 1వ డివిజన్ మంత్రపురి కాలనీని ఎమ్మెల్యే ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, మురుగునీటి కాల్వలు లేక ఇబ్బందులకు గురవుతున్నట్లు ఎమ్మెల్యేకు కాలనీవాసులు వివరించారు. దోమల బెడద అధికంగా ఉండడంతో విషజ్వరాల బారిన పడుతున్నామని వాపోయారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నరేష్‌గౌడ్, ఆరెల్లి వెంకటస్వామి, మాజీ సర్పంచ్ దేవరకొండ అనిల్, మాజీ అధ్యక్షుడు గడ్డం శివరాం ప్రసాద్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

శ్రీవెంకటేశ్వర కాలనీని అభివృద్ధి చేయాలి

మామునూరు: వరంగల్ 43వ డివిజన్ శ్రీవెంకటేశ్వర కాలనీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కాలనీవాసులు కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే నాగరాజును ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు.

ఎమ్మెల్యేను కలిసిన వడ్డెర సంఘం నాయకులు

వరంగల్: ఎమ్మెల్యే నాగరాజును వడ్డెర సంఘం నాయకులు క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

నెల రోజుల్లో ఇళ్ల పంపిణీ

హన్మకొండ అర్బన్: అర్హులైన పేదలకు నెల రోజుల్లోగా డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేస్తామని లబ్ధిదారులకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. హనుమకొండలోని అంబేడ్కర్ నగర్, జితేందర్‌సింగ్ నగర్‌లోని డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం లబ్ధిదారులు ఐదు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఈమేరకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తోట పవన్ ఈ దీక్ష శిబిరాన్ని ఆదివారం సందర్శించి వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా విదేశీ పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి.. వీడియో కాల్ ద్వారా లబ్ధిదారులతో మాట్లాడారు. ఎవరూ కూడా నిరుత్సాహ పడొద్దని, అర్హులైన పేదలందరికీ నెల రోజుల్లోగా డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. నిరాహార దీక్షలో పాల్గొన్న వారికి పవన్ నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు.

10, 11వ తేదీల్లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న మూర్తి

ఖిలా వరంగల్: వరంగల్ జిల్లా కేంద్రంలో ఈనెల 10, 11వ తేదీల్లో జరగనున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్.మూర్తి పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ కరీమాబాద్‌లో సీపీఎం కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ అధ్యక్షతన ఆదివారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మూర్తి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశాయని, బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించాయని విమర్శించారు. విద్యావ్యవస్థను కార్పొరేట్, ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పే విధానాలను అవలంబిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, యూనివర్సిటీల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయని వాపోయారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యాార ప్రశాంత్, రాకేష్, వినోద్‌కుమార్, మహేష్, సమీర్, తరుణ్ పాల్గొన్నారు.

గ్రూప్ -1 ఉద్యోగం ఇస్తామనడం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న సునీల్, నరేష్

కేయూ క్యాంపస్: ఇండియన్ క్రికెటర్ మహ్మద్ సిరాజ్‌కు, బాక్సర్ నిఖత్ జరీన్‌కు గ్రూప్ -1 ఉద్యోగాలు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల అసెంబ్లీలో ప్రకటించారని, వారికి గ్రూప్ -1 ఉద్యోగం ఇస్తామని ప్రకటించడం సరికాదని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, డీఎంఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేష్ అన్నారు. ఈ విషయంపై విచారణ జరపాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాసినట్లు వెల్లడించారు. కాకతీయ యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రం ఆవరణలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కనీసం డిగ్రీ అర్హత లేని, ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకోని వారికి గ్రూప్ -1 ఉద్యోగం ఇస్తామని పేర్కొనడం సమంజసమా అని ప్రశ్నించారు. అవసరమైతే మహ్మద్ సిరాజ్‌కు, నిఖత్ జరీన్‌కు రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి పదవి ఇవ్వాలని, లేదా స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా నియమించాలని, స్పోర్ట్స్ అంబాసిడర్లుగా నియమించి గౌరవించాలని సూచించారు. వారికి నగదు బహుమతులు, ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. సమావేశంలో టీఎస్ఎఫ్, డీఎంఎస్ఏ నాయకులు ఠాగూర్, వెంకట్, నాని, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట జంక్షన్‌లో వెల్ బేబీషో



వెల్ బేబీషోలో పాల్గొన్న చిన్నారులతో ఇన్‌స్టిట్యూట్ కమిటీ సభ్యులు

కాజీపేట రూరల్: 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కాజీపేట రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఇన్‌స్టిట్యూట్ కమిటీ ఆధ్వర్యంలో రైల్వే కార్మికుల పిల్లలకు వెల్ బేబీ షోతో పాటు డ్రెస్ కాంపిటీషన్, చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రైల్వే ఆస్పత్రి డీఎంఓ డాక్టర్ హరిబాబు హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్ మాట్లాడుతూ వెల్ బేబీషోలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారని తెలిపారు. విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం నాడు బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ కమిటీ కార్యవర్గ సభ్యులు ఎం.రాజయ్య, జి.రాజేశ్వర్‌రావు, ధరావత్ రఘు, ఎస్.ప్రవీణ్, పి.రవికిరణ్ పాల్గొన్నారు.

పేదవారికి సేవ చేయాలి



కేక్ కట్ చేస్తున్న బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ సభ్యులు

హన్మకొండ: స్నేహితులు ఆర్థికంగా ఎదిగి పేదలకు చేయూనందించాలని బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పులి దేవేందర్ సూచించారు. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలో బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం జరుపుకున్నారు. స్నేహితులతో కలిసి దేవేందర్ కేక్ కట్ చేసి అనంతరం మాట్లాడారు. తమ కష్టసుఖాలను కేవలం మిత్రులతోనే పంచుకుంటామని చెప్పారు. అలాంటి మిత్రుల ఆలోచనలతోనే బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ స్థాపించినట్లు వివరించారు. ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో గంధమాల ప్రవీణ్ కుమార్, కొయ్యడ లక్ష్మణ్, గర్వెల్లి శ్రీనివాస్, డోలి రాజ్‌కుమార్, మామిడాల అనిల్ కుమార్, పెంచాల అశోక్, జన్ను రాజమౌళి, తోట రమేష్, గుండబోయిన నవీన్, బోనాల రమేష్, మామిండ్ల ఆంజనేయులు, యాకయ్య, పులి లావణ్య, సంపత్, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

శ్వేతార్కలో ఆషాఢమాస ఉత్సవాలు

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం ఆవరణలో మూడు రోజులుగా త్రయాన్నిక దీక్షతో నిర్వహిస్తున్న అఖండ లలితా పారాయణం, పూర్ణాహుతితో మానస చండీహోమ పూజలు ఆదివారం ముగిశాయి. ఆషాఢ మాసం చివరి ఆదివారం, అమావాస్యను పురస్కరించుకుని ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు అయిన వోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్వేతార్కుడికి లక్ష గరికలతో అభిషేకం జరిపించారు. పూజలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు వెంకటేశ్వర్లు శర్మ, సాయికృష్ణ శర్మ, రవి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరి అమ్మవారి జయంతి

హసన్‌పర్తి: చౌడేశ్వరీ అమ్మవారి జయంతి వేడుకలు హసన్‌పర్తిలోని దేవాంగుల కుల ఆధ్వర్యంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని కూరగాయలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో దేవాంగుల కుల సంఘం సభ్యులు సురేష్, రవి, వెంకటేశ్వర్లు, పాలాస సురేష్, నాగుల నాగేందర్, ఉమాశంకర్, సాంబయ్య, ఆలయ అర్చకుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తబంధం కన్న స్నేహబంధం గొప్పది

హసన్‌పర్తి: రక్తబంధం కన్న స్నేహబంధం గొప్పదని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు అన్నారు. హసన్‌పర్తి వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఫ్రెండ్‌షిప్ డే వేడుకలను ఆదివారం నిర్వహించారు. వాసవి క్లబ్ అధ్యక్షుడు శ్యాంసుందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు గౌరిశెట్టి కృష్ణమూర్తి, నాగమళ్ల సుధీర్, భీష్మనాథం, చిదర కరంచంద్, శంకర్, పురవర్దన్ తదితతరులు పాల్గొన్నారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని మిత్ర మండలి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. సొసైటీ అధ్యక్షుడు రమేష్, సభ్యులు వంకర్, సురేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి స్మారకార్థం అన్నదానం

విద్యారణ్యపురి: ఇటీవల మరణించిన తమ స్నేహితుడు పిన్నంటి హరీష్ జ్ఞాపకార్థం స్నేహితుల దినోత్సవం సందర్భంగా అన్నదానం చేశారు. 2009 – 2010లో పెగడపల్లి జెడ్పీహెచ్ఎస్ బ్యాచ్‌కు చెందిన స్నేహితులు ఆదివారం యూనివర్సిటీ సమీపంలోని పలివేల్పుల ప్రాంతంలోని లార్డ్ వృద్ధాశ్రమం, హనుమకొండలోని సర్క్యూట్ గెస్ట్ హౌస్ సమీపంలోని సాయిస్పందన మానసిక వికలాంగుల బధిరుల ఆశ్రమం, బస్టాండ్ సమీపంలోని మల్లికాంబ మనోవికాస వికలాంగుల ఆశ్రమంలో అన్నదానం చేసి పండ్లు పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పోలెపాక దినకర్, రాము, శ్రీకాంత్, రాజు, రంజిత్, శివ, శ్రీనివాస్, కళాధర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహ బంధం ఎంతో మధురం

వరంగల్ చౌరస్తా: స్నేహ బంధం ఎంతో మధురమైనదని వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్, నవ నిర్మాణ్ కోచ్ డాక్టర్ పద్వీరాజు వల్లా అన్నారు. వరంగల్ పిన్నావారి వీధిలోని వాసవి క్లబ్ వరంగల్ కార్యాలయంలో క్లబ్ ఇన్‌చార్జ్ ప్రెసిడెంట్ తోట మార్కండేయ అధ్యక్షతన స్నేహితుల దినోత్సవం కార్యక్రమంలో కార్యదర్శి పల్లెర్ల వీరన్న, ఇంటర్నేషనల్ ఆఫీసర్ మల్యాల వీరమలయ్య, పుల్లూరు కిషోర్, గోవింద రాజులు, డాక్టర్ గుంటూరు వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు నిధులు మంజూరు చేయాలి

హసన్‌పర్తి: స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ధర్మసాగర్ నుంచి హసన్‌పర్తి మండలం మడిపల్లి వరకు రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని మాజీ సర్పంచ్ చిర్ర సుమలత కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే కడియం శ్రీహరికి ఆదివారం వినతి పత్రం అందించారు. అలాగే, మడిపల్లిలోని గుండు చెరువులోకి దేవాదుల నీరు మళ్లింపునకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు చిర్ర విజయ్‌కుమార్, మాచర్ల మహేందర్, జంపాల రమేష్, జక్కుల రవీందర్, శ్రీధర్, జలందర్, సదానందం పాల్గొన్నారు.

రైతులకు డీలర్లు అండగా ఉండాలి

కాశిబుగ్గ: రైతులకు డీలర్లు అండగా ఉండాలని రాష్ట్ర రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు సూచించారు. నవత ఆగ్రో కెమికల్స్ ఆధ్వర్యంలో శివనగర్‌లోని ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ భవనంలో ఆదివారం జరిగిన బేయర్స్ డీలర్స్ మీట్‌లో ఆయన మాట్లాడారు. కంపెనీ నుంచి భారీ లాభాలు ఆశించకుండా రైతులకు న్యాయం చేసేవిధంగా రైతుల పక్షపాతిగా డీలర్లు నిలవాలని కోరారు. కార్యక్రమంలో నవత ఆగ్రో కెమికల్స్ భాగస్వాములు నరేంద్రకుమార్, రంజిత్, బేయర్ కంపెనీ ప్రతినిధులు అశోక్‌రెడ్డి, నారాయణరెడ్డి, సతీష్, మహంత్, బాలకృష్ణ, శివ, శ్రీనివాస్, రాజు, కేదారి, సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

విరమణ పొందిన హెచ్ఎంకు సన్మానం

విద్యారణ్యపురి: వర్ధన్నపేటలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గెజిటెడ్ హెడ్‌మాస్టర్‌గా పనిచేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన రాపాక సదానందంను హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో వాకర్స్, పరపతి సంఘం సభ్యులు ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దామెర భిక్షపతి, పరపతి సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తోట భిక్షపతి, ఆర్థిక కార్యదర్శి రమేష్, సహా అధ్యక్షుడు రాజిరెడ్డి, కార్యదర్శులు సంపత్, గెజిటెడ్ హెచ్ఎంలు కృష్ణ, రవీందర్, రఘు, సీహెచ్.రవీందర్ పాల్గొన్నారు.

సామాజిక సేవలో ముందుండాలి

ఖిలా వరంగల్: రోటరీ క్లబ్ ఇంటర్‌నేషనల్ అభివృద్ధితోపాటు సామాజిక సేవలో ముందుండాలని ప్రాంతీయ బోర్డు డైరెక్టర్లకు రోటరీ ఇంటర్ నేషనల్ ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ గవర్నర్లు కొంపెల్లి ప్రభాకర్, వడ్లమాని జవహర్, సహాయ గవర్నర్ గార్లపాటి శ్రీనివాస్, తెలంగాణ ప్రాంతీయ సహాయ కార్యదర్శి తోట వైద్యనాథ్ సూచించారు. ఈమేరకు వరంగల్ రైల్వేగేట్ శాంతినగర్‌లో గార్లపాటి శ్రీనివాస్ అధ్యక్షతన రోటరీ క్లబ్ ఇంటర్‌నేషనల్ జిల్లా 3150 ప్రాంతీయ డైరెక్టర్ల శిక్షణ శిబిరం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథులుగా వారు హాజరై మాట్లాడారు. అనంతరం క్లబ్ వార్షిక నివేదికను ఆమోదించి, ఈఏడాది చేయాల్సిన కార్యక్రమాలను వివరించారు. క్లబ్ ప్రతినిధులు రఫీ, శ్రీనివాస్, ప్రభాకర్, రాజగోపాల్, కుమారస్వామి, యుగేందర్, వేణుగోపాల్, అలీ పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

మడికొండ: దర్గా కాజీపేట సొసైటీ డైరెక్టర్ దువ్వ శ్రీకాంత్ నానమ్మ దువ్వ కొమురమ్మ అనారోగ్య సమస్యలతో శనివారం రాత్రి మృతి చెందారు. మృతురాలి కుటుంబ సభ్యులను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, ఆదివారం పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, గుర్రం అమర్‌నాథ్, కుర్ల మోహన్, బిల్ల రవీందర్, వస్కుల శంకర్, నాగరాజు, దువ్వ విజయ్, శేఖర్, కుందురు రాజేష్‌రెడ్డి, నీలం వేణు, పైడిపాల రఘుచందర్ పాల్గొన్నారు.

సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ సభ్యుడికి సన్మానం

ఖిలా వరంగల్: సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ సభ్యుడిగా నియామకమైన కొయ్యాడ ప్రభాకర్ (కరాటే)ను మాజీ కార్పొరేటర్ బాసాని శ్రీనివాస్ ఆదివారం మర్యాద పూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌కు పుష్పగుచ్చం అందజేసి సన్మానించారు. రమేష్, భాస్కర్, బాబు, సునీల్ పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

వరంగల్ అర్బన్: ఆత్మరక్షణ కోసం కరాటే దోహదపడుతుందని బీజేవైఎం రాష్ట్ర నాయకుడు సిద్దం నరేష్ అన్నారు. వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయంలో ఆదివారం జరిగిన జాతీయ కరాటే పోటీల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నేషనల్ కరాటే యూనియన్ ప్రతినిధులు చంద్రశేఖర్, గాదె రవీందర్, కల్లెపు విజయ్, బచ్చు రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ కార్యాలయంలో రక్తదాన శిబిరం



రక్తదాతలను అభినందిస్తున్న నిర్వాహకులు

హన్మకొండ అర్బన్: స్నేహితుల దినోత్సవం సందర్భంగా నగరంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తలసేమియా బాధితుల కోసం పలువురు అసోసియేషన్ సభ్యులు రక్తదానం చేశారు. అనంతరం హనుమకొండ రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యుడు పుల్లూరు వేణుగోపాల్ మాట్లాడుతూ రక్తదాతలను అభినందించారు. వారికి సర్టిఫికెట్లను అందజేశారు. రక్తదానం చేసిన వారిలో ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు సుదర్శన్, అబ్దుల్, గఫర్, రాజేష్, రవీందర్, శివశంకర్, శ్రీధర్, రాజమౌళి, మనోహర్‌రెడ్డి, విఠల్, వంశీ, రెడ్‌క్రాస్ డాక్టర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నయీంనగర్: స్నేహితుల దినోత్సవం సందర్భంగా జెడ్పీహెచ్ఎస్ నేరుడుపల్లిలో 1989 – 1990లో పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నయీంనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో రఘు, భాస్కర్, శ్రీనివాస్, సుభాన్, భీమరావు, జంపయ్య, రాజు, రవీందర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.